# ఇల్లు దొరికింది!

– డి.కె. చదువులబాబు

వెంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చినట్లు ఇంటి ఓనర్ కొడుకులు వేరుపడటం చిదానందం ప్రాణం మీదకొచ్చిపడింది. తలప్రాణం తోకకొచ్చినా ఆఫీస్ దగ్గరలో ఇల్లు దొరికేలా లేదు.

''ఇంటికోసం తిరిగి తిరిగి కాళ్ళరిగి మోకాళ్ళలో కొచ్చాయి. ఇల్లు మాత్రం దొరికేలా లేదు'' అన్నాడు చిదానందం ఆయాసపడుతూ.

ఉదయం లేచి ఫ్రెష్‌గా స్నానం చేసి, నీట్‌గా తయారయ్యారు. ఎంత తిరిగినా అరిగిపోకుండా పీకలదాకా మెక్కారు. ''ఈ రోజైనా ఇల్లు దొరికేలా చెయ్‌స్వామీ, రాగానే కొబ్బరికాయ కొడతాం'' అని దేవునికో దండం బెట్టి ఇంట్లో నుండి బయటపడ్డారు.

కాళ్ళీడ్చుకుంటూ కాళానగర్‌లో కాలుపెట్టారు.

'టు లెట్' బోర్డు కోసం ఆత్రంగా వెదుకుతున్నాయి చిదానందం కళ్ళు. తల అటూ, ఇటూ త్రిప్పి త్రిప్పి మెడనొప్పి పట్టింది. శరీరం చెమటలు పడుతోంది. కళ్ళు కాయలు కాస్తున్నాయి.

'పగవాడిక్కూడా ఈ బాధ ఒద్దురా బాబోయ్' అని గొణుక్కుంటున్న చిదానందం ఠక్కున ఆగిపోయాడు.

కొంతదూరంలో ఓ ఇంటి ముందు 'టు లెట్' బోర్డు వ్రేలాడుతోంది. కలా, నిజమా, వైష్ణవమాయా అని తనను తాను ఫెడీల్మని చెంపమీద ఓ దెబ్బ కొట్టి చూసుకుని నిజమేననే నిర్ణయానికొచ్చాడు.

''కాంతం...కాంతం..అదిగో ఇల్లు'' అంటూ ఓ గెంతు గెంతి చంకలు గుద్దుకున్నాడు.

సంతోషం పట్టలేక కాంతం కూడా ఓ రెండు చుట్లు గిర్రున బొంగరంలా తిరిగింది. వాళ్ళని చూడగానే పక్కింటి నుండి రోడ్ రోలర్‌లా వున్నావిడ, వెదురు కర్రలా వున్నాయన దగ్గర కొచ్చారు.

''రండి, రండి, ఇల్లు మాదేనండీ. నా పేరేమో సుబ్బలక్ష్మండీ. ఈయన మావారు సుబ్బారావండీ'' రోడ్‌రోలర్ లాంటి సుబ్బలక్ష్మి చెప్పింది.

'అసలీయనకు ఈవిడ తిండిపెడుతోందా, రెండు భాగాలూ తానే మేస్తోందా?' అనే అనుమానమొచ్చింది చిదానందానికి. ఉడతకెందుకు ఊళ్ళో పెత్తనమనుకుని, అనుమానాన్ని పక్కకి నెట్టేస్తూ ''ఇల్లు చూపిస్తే చూస్తామండీ'' అన్నాడు.

నడుముకున్న తాళాలు బయటకు తీసింది సుబ్బలక్ష్మి. ఆ ఇంట్లో దుమ్ము, ధూళి చూడగానే చిదానందం, కాంతం అదిరిపడ్డారు.

ఏ ఇక్ష్వాకుల నాటి కాలం నుండో ఖాళీగా పడి వున్నట్లుంది.

''కొంపలుముంచే బాడుగ చెప్తుంటారు. ఖాళీపడకేం చేస్తుంది'' గొణుక్కున్నాడు చిదానందం.

''బాడుగెంతండీ'' అడిగింది కాంతం.

''ఎనిమిదొందలిచ్చుకోండి చాలు'' చెప్పింది సుబ్బలక్ష్మి.

ఆశ్చర్యంతో అదిరిపడ్డాడు చిదానందం. మళ్ళీ ఫెడీల్మని చెంపమీద కొట్టుకుని నిజమేనని నిర్ణయించుకుని ''అమ్మో..ఇంత చౌకా'' అని ఆనందం పట్టలేక ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఓ క్షణం గుండెలనిండా గాలి పీల్చుకుని ''షరతులూ..అవేనండీ కండిషన్స్ ఏమైనా వుంటే చెప్పుకోండి'' అన్నాడు. ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ వెర్రివెధవను చూస్తున్నట్లు చిదానందం వైపు చూశారు సుబ్బలక్ష్మి, సుబ్రావ్‌లు.

''అదేనండీ..ములుకులు కొట్టొద్దు. కొంపలో నల్గురే వుండాల. చుట్టాలు, పక్కాలొచ్చి వారాలుండకూడదు. రాత్రి తొమ్మిది లోగా కొంప చేరాల. తలుపులను తాకకుండా వెయ్యాల. చీమలు చావకుండా నడవాల..వగైరా..వగైరా'' అడిగాడు పళ్ళన్నీ బయట పెట్టి చిదానందం.

''అలాంటివేం లేవు. అడ్వాన్స్ ఇచ్చి చేరిపోండి'' ఓ నువ్వు నవ్వి ఆనందంగా చెప్పాడు సుబ్బారావు.

కాంతానికి కళ్ళు తిరిగాయి. చిదానందం వండ్రైపోయాడు. సుబ్బారావు నవ్వు, ఆనందం చూసి తెగబోలెడు అనుమానం పుట్టుకొచ్చింది చిదానందానికి.

కాంతాన్ని పక్కకు పిలిచి ''ఈ కొంపలో ఏ దెయ్యమో భూతమో లేదు కదా! ఈ కాలనీలో, ఈ బాడుగకు, ఏ షరతుల్లేని కొంప ఖాళీగా పడుందంటే నాకు తెగ అనుమానంగా వుంది'' అన్నాడు చెవిలో.

''ఇదేదో ఆలోచించాల్సినట్లే వుంది. తొందరపడి అడ్వాన్సివ్వకండి. చుట్టుపక్కల విచారిద్దాం'' చెవిలో గొణిగింది కాంతం.

''ఏంటి ఒకరి చెవులొకరు కొరుక్కుంటున్నారు'' అని తన జోక్‌కు తనే ఘొల్లున్న నవ్వాడు సుబ్బారావు.

ఆ నవ్వుకు చిదానందం అదిరిపడి ''అబ్బే..ఏం లేదండీ..జేబులో అడ్వాన్సు డబ్బు లేదు. మళ్ళీ వస్తాం'' అంటూ బయటకు నడిచాడు. వారివైపు నిరాశగా చూశాడు సుబ్బారావు.

ఆ చూపులో నిరాశను పసిగట్టిన చిదానందం అనుమానం మరింత బలపడుతుండగా 'ఈ ఇంట్లో ఖచ్చితంగా ఏదో గూడపురాణీ వుంది' అనుకున్నాడు.

వీధిలో పంపుదగ్గర అమ్మలక్కలు నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడికెళ్ళి ఆ ఇంటి చరిత్ర అడిగారు.

అమ్మలక్కలు వారి వైపు బలిపశువుల చూసినట్లు తెగ జాలిగా చూశారు. చిదానందం అయోమయంగా దిక్కులు చూశాడు.

''విషయ మేంటో చెప్పండి'' అంది కాంతం.

''ఏం లేదమ్మా, ఆ ఇంటావిడ కవితలు రాస్తూ వుంటుంది. ఆ ఇంట్లో చేరిన వారెవరూ పట్టుమని పది రోజులుండరు'' చెప్పారు.

చిదానందానికి పై ప్రాణాలు పైనే పోయినట్లయింది. సుబ్బారావు ఎందుకలా రివటలా అయిపోయాడో, తాము తిరిగి వెడుతుంటే ఎందుకలా దీనంగా చూశాడో చిదానందాని కర్థమయింది. కాంతం ఆనందంతో భుజాలెగరేసి, గిర్రున రెండు చుట్లు బొంగరంలా తిరిగి ''అడ్వాన్సు ఇచ్చొద్దాం పదండి'' అంది.

''నీ కిదేం పోయేకాలం. అమ్మో నేనురాను. ఊపిరుంటే ఉప్పయినా అమ్ముకుని బ్రతకొచ్చు'' బెదిరిపోతూ అన్నాడు.

''నాకు కవిత్వమంటే ప్రాణమని మీకు తెల్సుకదండీ, కనబడిన ప్రతి పత్రికలో కవితలు చదువుతుంటా గదా! కవయిత్రి ఇంటి పక్కన వుండగలగడమంటే మన పూర్వజన్మ సుకృతం. అదేదో సామెతలా కవిత్వం వాసన మీకేం తెల్సు మీకిష్టం లేకపోతే కవితలు చదవొద్దు. ఎలాగూ మీరు ఆఫీసుకెళ్తారుగా! మీకేం భయం లేదు'' అంటూ గారాలుబోయి, సముదాయించి చిదానందాన్ని ఒప్పించింది కాంతం.

ఓ శుభ ముహూర్తాన చిదానందం, కాంతం ఆ ఇంట్లో చేరారు. సామానులు సర్దుకోడానికి ఓ రోజు పట్టింది.

తెల్లారగానే ఆఫీసు కెళ్ళిపోయాడు చిదానందం.

తీరికగా కూర్చుని పుస్తకం తిరగేస్తున్న కాంతం గుమ్మంలో అలికిడికి తలెత్తి చూసింది. ఎదురుగా సుబ్బలక్ష్మి. చేతిలో ఓ పెద్ద బైండింగ్ చేయబడిన పుస్తకముంది.

''రండి, రండి కూర్చోండి పిన్నిగారూ'' ఆప్యాయంగా ఆహ్వానించింది కాంతం. ఛైర్‌లో కూర్చుంది సుబ్బలక్ష్మి.

''అమ్మాయ్, నీతో ఓ విషయం చెప్పాలి''

''ఏంటో చెప్పండి పిన్నిగారూ!'' అంది కాంతం వినయంగా.

''నేను కవితలు రాస్తుంటాను''

''హేంటీ, మీరు కవయిత్రా! ఎంతదృష్టం, ఎంత

దృష్టం. నాకు కవితలంటే ప్రాణం పిన్నిగారూ! పత్రికల్లో మీపేరెప్పుడూ చూడలేదే! ఏదైనా కలం పేరుతో రాస్తుంటారా'' ప్రపంచంలోని ఆశ్చర్యాన్నంతటినీ ముఖం మీదకు తెచ్చుకుంది కాంతం.

''కలం పేరా, నా బొందా! అలాంటిదేం లేదమ్మాయ్! పత్రికల వాళ్ళకు నా కవితలు అర్థం చేసుకునే శక్తి, వేసుకునే అదృష్టం లేక త్రిప్పిపంపారు. రాత ప్రతులన్నీ బైండింగ్ చేయించి వుంచా'' గర్వంగా భుజాలెగరేస్తూ చెప్పింది.

ఆ మాటకు కాంతం అదిరిపడింది.


'అయ్యో..అమ్మో..బాబోయ్..తిరిగొచ్చిన కవితలా? వాటి తడాఖా ఏంటో వేరే చెప్పనవసరం లేదు' అని మనసులో గొణుక్కుని బిత్తరచూపులు చూసింది కాంతం.

''ఏంటమ్మాయ్, అలా చూస్తున్నావ్. తీరిగ్గా వున్నావని నాకవితలు వినిపిద్దామని వచ్చాను. అన్నట్లూ..మీ ఆయనేడీ?'' సూటిగా విషయంలోకి దిగుతూ అంది సుబ్బలక్ష్మి.

కాంతానికి పై ప్రాణాలు పైనే పోయాయి.

''మా ఆయన ఆఫీస్ కెళ్ళారు. పుస్తకం ఇచ్చి వెళ్ళండి పిన్నిగారూ. చదివిస్తాను'' చెప్పింది కాంతం.

పుస్తకం ఇచ్చి వెళ్తే ఏం జరిగే అవకాశముందో సుబ్బలక్ష్మికి అనుభవమే. ఇలాగే ఓసారి కౌసల్య అనే ఆవిడ పుస్తకమిస్తే చదువుతానంది. సుబ్బలక్ష్మి ఆలోచించి పుస్తకంలో అక్కడక్కడా ఎండిన ఆకుల ముక్కలు, సన్నకాగితం ముక్కలు, ఇసుక రేణువులు వుంచి ఇచ్చింది.



కౌసల్య పుస్తకం తిరిగిస్తూ ''మీ కవితలు అద్భుతంగా వున్నాయి. అమోఘంగా వున్నాయి'' అంటూ ఆకాశానికెత్తేసింది. తీరా ఇంటికెళ్ళి చూస్తే ఆకుముక్కలు, కాగితం ముక్కలు, ఇసుక రేణువులు పుస్తకమే తెరవలేదంటూ వెక్కిరిస్తూ కనిపించాయి.

ఆరోజు నుండి సుబ్బలక్ష్మి చదివి వినిపిస్తుందే కానీ చదవమని ఎవ్వరికీ ఇవ్వదు. ఆమె కవితలకు భయపడి, జడుపుతో చుట్టు పక్కలందరికీ జ్వరాలొచ్చాయి. అంతా తప్పించుకు తిరుగుతుంటారు. ఎవ్వరూ దొరక్క ఇంట్లో విధిలేక దొరికే సుబ్బారావు పీనుగైపోయాడు.

''పర్వాలేదమ్మాయ్! నేను వినిపిస్తానుగా! చదవటానికీ ఓ స్టైల్ వుంటుంది. అలా చదివితేనే మజా! పనిలో పనిగా మీ ఆయనా వింటారు. సాయంకాలం వచ్చి వినిపిస్తా! మచ్చుకి నీకు ఓ నాలుగు కవితలు మాత్రం వినిపించి వెళ్తా. నీలాంటి కవితాభిమాని దొరకటం నా అదృష్టం'' అంది పొంగిపోతూ సుబ్బలక్ష్మి.

''ఇంట్లో పనుంది పిన్నిగారూ, సాయంత్రం రండి. మా ఆయన కూడావుంటారు'' దిక్కులు చూస్తూ చెప్పింది కాంతం.

''అలాగే నమ్మా,వెళ్ళొస్తా'' అంటూ వెళ్ళిపోయింది సుబ్బలక్ష్మి.

సాయంకాలం చిదానందం రాగానే వచ్చింది సుబ్బలక్ష్మి. విషయం తెలిసి చిదానందం జడుసుకున్నాడు.

''నా ప్రాణం మీదకొచ్చిందేమిట్రా దేవుడా?'' అని లబోదిబోమన్నాడు. తన కవితల మిత్రుడు గుర్నాథం గుర్తొచ్చాడు. తను చలీ జ్వరంతో రెండు వారాలు మంచమెక్కడం గుర్తొచ్చి బిత్తర చూపులు చూశాడు.

''రండమ్మాయ్! కూర్చోండి'' అంద్ది పుస్తకం విప్పుతూ సుబ్బలక్ష్మి.

ఆకలిగొన్నపులిలా చూస్తోంది సుబ్బలక్ష్మి.

బలికి నడిచే మేకపిల్లలా కిమ్మనకుండా వచ్చి ఎదురుగా కూర్చుంది కాంతం. ఏడ్వడమొకటే తక్కువ.

''ఇప్పుడే వస్తానండీ'' అంటూ పరుగున ఇంట్లోకెళ్ళి క్షణంలో తిరిగొచ్చి సుబ్బలక్ష్మికి దూరంగా కూర్చున్నాడు చిదానందం.

మొదలు పెట్టింది సుబ్బలక్ష్మి. గోడరాళ్ళు పడుతున్నట్లుంది. వడగండ్లవాన నడినెత్తిన కురుస్తున్నట్లుంది. ఒక్కో కవితా బాణం సంధిస్తోంది సుబ్బలక్ష్మి.

కాంతం మెదడు మొద్దుబారుతోంది. ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ వెర్రి వెంగళమ్మలా కూర్చుండిపోయింది.

''పగవాడిక్కూడా ఈ బాధ వద్దురా బాబోయ్..ఎన్ని జన్మల పాప ఫలితమో'' మనసు రోదిస్తోంది.

మలేరియా రోగిలా కాంతం వణికిపోతోంది.

''భలే..భలే..ఓహో..ఆహా..కవితలు అద్భుతంగా వున్నాయి. వన్స్‌మోర్..కానివ్వండి'' వంత పాడసాగాడు చిదానందం.

చిదానందం తాళానికి మరింత రెచ్చిపోయి విజృంభించిందావిడ.

కాంతానికి కడుపులో ఎలుకలు తిరుగుతున్నట్లుంది. మెదడులో బొద్దింకలు పాకుతున్నట్లుంది. మొహంలో నెత్తురు చుక్కలేకుండా ఇంకిపోయింది.

భర్త అంత సంతోషంగా ఎలా భరించగల్గుతున్నాడో కాంతాని కర్థం కాలేదు. అనుమానమొచ్చి దూరంగా కూర్చున్న భర్త చెవులవైపు చూసింది. అక్కడ వుండాల్సిన హియరింగ్ మిషన్ లేదు.

''ఓహో..ఈ చెవిటి మారాజు హియరింగ్ మిషన్ తీసి ఇంట్లో పెట్టి వచ్చాడన్నమాట. ఉండనీ ఈ చెవిటి మాలోకం పని చెబుతా'' అనుకుంటూ లేచి ''కొంచెం పనుంది. మళ్ళీ వస్తా పిన్నిగారూ'' అంటూ ఇంట్లోకి నడిచింది కాంతం. కాంతం వెళ్ళగానే సుబ్బలక్ష్మి లేచి నిలబడి ''అల్లుడుగారూ ఇప్పటికి చాలు. ఇంట్లో ఇలాంటి పుస్తకాలు ఇంకా నాలుగున్నాయి. మళ్ళీ రేపొస్తా'' అంది ఓ నవ్వు నవ్వి.

''అలాగే, అలాగే అత్తయ్యగారూ'' అన్నాడు చిద్రానందం.

అంతలో ''ఏమండీ, మీ హియరింగ్ మిషన్ ఇంట్లో మరిచిపోయారు'' అంటూ పరుగున వచ్చి చేతికిచ్చింది కాంతం.

''ష్! అది కావాలనే ఇంట్లో పెట్టేశాను. గట్టిగా అర్థవకు. ఆవిడవింటుంది'' అన్నాడు చిదానందం. చెవిమిషన్ తగిలించుకుని! కాంతం..ఆ అంటూ నోరు తెర్చివుండిపోయింది! ఏదోవిధంగా చవకగా ఇల్లు అద్దెక్కు దొరికిందని ఆనందించాడు చిదానందం.

★